సాక్షి
కాకినాడ

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



చదువుల పండగకు సర్వం సిద్ధం

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో చదువుల పండగ పేరుతో ఆదివారం నుంచి 4వ తేదీ వరకూ మహాక్రతువులు నిర్వహించనున్నారు.


II లో



అంతర్వేదిలో గొప్పగా..

అంతర్వేది ఉత్సవాలంటే కనులకు వైకుంఠమే.. అలాంటి వేడుకలకు సమయం దగ్గర పడడంతో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 7,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.55 అడుగులకు చేరింది.



మొండిచేయి



- జిల్లా ప్రజల ఆశలపై కేంద్రం నీళ్లు
- బడ్జెట్‌లో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు దక్కని చోటు
- పవన్ లాబీయింగ్ ఏమైందని ప్రశ్న
- బడ్జెట్‌పై మేధావి వర్గం పెదవి విరుపు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జిల్లా ప్రజల ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు జల్లింది. కేంద్ర బడ్జెట్‌లో జిల్లాలోని పలు ప్రాజెక్టులకు చోటు ఇవ్వకపోవడంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సహా జిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలకు చెందిన వారే. వీరిలో పిఠాపురం నుంచి గెలుపొందిన జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తనకు కేంద్రంలో బీజేపీతో మంచి సంబంధాలున్నాయని గొప్పగా చెబుతూంటారు. కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా కూడా ఉన్న ఆయనకు ప్రధాని సహా కేంద్ర పెద్దలతో మంచి సాన్నిహిత్యం ఉందని, తమ నేతకు తిరుగే లేదని ఆ పార్టీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో నిత్యం హడావుడి చేస్తూంటారు. ఇదంతా నిజమే అయితే కేంద్ర బడ్జెట్‌లో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు కేటాయింపులు సాధించి ఉండాలి కదా అని పలువురు విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు.

ఉప్పాడ కోత నివారణకు నిధులేవీ?

తనను అసెంబ్లీకి పంపించిన పిఠాపురం నియోజకవర్గంలో కీలకమైన ఉప్పాడలో సముద్ర కోత నివారణకు.. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా పరిశీలన జరిపి సుమారు రూ.2 వేల కోట్లతో కోత నివారణతో పాటు, తీరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని గతంలో పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. తీర రక్షణకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు కూడా అన్నారు. కేంద్రంతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయని, నిధులు తెస్తానని గొప్పలు చెప్పారు. ప్రతిపాదనలు సైతం సిద్ధం చేస్తున్నామని ప్రకటించారు. తీరా చూస్తే కేంద్ర బడ్జెట్‌లో ఉప్పాడ సముద్ర కోత నియంత్రణకు నయాపైసా కూడా కేటాయించ లేదు. దీనిపై పవన్ ప్రయత్నించ లేదా.. ప్రయత్నించినా ఫలితం దక్కలేదా అనే చర్చ జరుగుతోంది.

పారిశ్రామికాభివృద్ధి ప్రశ్నార్థకం

పోర్టు సిటీగా పేరొందిన కాకినాడలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెట్టేలా కేంద్ర బడ్జెట్‌లో చోటు దక్కుతుందని పారిశ్రామికవేత్తలు భావించారు. తీర ప్రాంతంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న కాకినాడ స్పెషల్ ఎకనమిక్ జోన్(కేఎస్ఈజెడ్)లో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా ప్రోత్సాహకాలు అందిస్తారనుకున్నారు. కాకినాడ పోర్టు నుంచి విదేశీ ఎగుమతులకు అధికంగా అవకాశాలున్నప్పటికీ ఆ దిశగా బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించలేదని పెదవి విరుస్తున్నారు. కాకినాడ సమీపాన ఆన్‌షోర్, ఆఫ్‌షోర్‌లలో రిలయన్స్, ఓఎన్‌జీసీ వంటి సంస్థలు చమురు నిక్షేపాలు వెలికి తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేఎస్ఈజెడ్‌లో ఆయిల్, గ్యాస్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై బడ్జెట్‌లో ప్రస్తావన ఉంటుందనుకున్నా నిరాశే మిగిలింది. అయితే, సముద్ర ఉత్పత్తుల్లో ఫ్రోజెన్ చేపలు, చేపల పేస్ట్ వంటి ఉప ఉత్పత్తులపై పన్నులు తగ్గించడం మత్స్య ఉత్పత్తులకు కొంత ఊపిరి పోస్తుందని మత్స్యకార ప్రతినిధులు అభిప్రాయ పడుతున్నారు.

ప్చ్.. వీటికీ చోటు దక్కలే..

- **కాకినాడ స్మార్ట్ సిటీకి** కేంద్ర బడ్జెట్‌లో చోటు **దక్కలేదు. కేంద్ర, రాష్ట్ర** ప్రభుత్వాల నిధులు **రూ.1,005 కోట్లతో ఈ** పనులు నూరు శాతం **పూర్తి చేయాలి. ఇంతవరకూ** రూ.783.58 **కోట్లు మాత్రమే** వచ్చాయి. నగరంలో **విద్యుత్తు బస్సుల నిర్వహణ,** అమృత్ పథకానికి **అవసరమైన నిధుల** ఊసే బడ్జెట్‌లో **లేకుండా పోయింది.**
- **ప్రతిష్టాత్మక ఇండియన్** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ **(ఐఐఎఫ్‌టీ)** జేఎన్‌టీయూకేలోని తాత్కాలిక **భవనంలో నడుస్తోంది.** మూడేళ్ల క్రితం కేంద్రం **ప్రారంభించిన** ఈ సంస్థకు బడ్జెట్ **కేటాయింపులపై ఆశలు** పెట్టుకున్నా ఫలితం దక్కలేదు. ఈ సంస్థకు ఉప్పాడ కొత్తపల్లి మండలం కోనపాపపేట వద్ద 25 ఎకరాలు కేటాయించగా కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.230 కోట్లతో బడ్జెట్ అన్నారు. ఇందులో సగం కూడా కేటాయించకపోవడంపై మేధావులు పెదవి విరుస్తున్నారు.
- ఉప్పాడలో నిర్మిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌కు కూడా బడ్జెట్‌లో చోటు దక్కలేదు.
- వీటికి బడ్జెట్‌లో నిధులు వచ్చేలా ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్.. కాకినాడలో పుట్టి, పెరిగి, రాజ్యసభ సభ్యుడైన సానా సతీష్ బాబు ప్రయత్నించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాకినాడ మెయిన్ రైల్వే లైన్ ఊసేదీ?

కాకినాడను మెయిన్ రైల్వే లైనుతో కలపాలనేది ఇక్కడి ప్రజల నాలుగున్నర దశాబ్దాల కల. చెన్నై - హౌరా ప్రధాన రైలు మార్గంలో ముఖ్యమైన రైళ్లన్నీ సామర్లకోట జంక్షన్ మీదుగానే వెళ్లిపోతూంటాయి. ఈ మార్గంలో పిఠాపురం నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకినాడను మెయిన్ లైన్‌లో కలపాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. డబ్లింగ్ పనులు పునఃపరిశీలనలో ఉన్నట్లు కేంద్రం ప్రకటించినా కదలిక లేదు. మరోవైపు కోటిపల్లి - నరసాపురం రైలు మార్గం పనులకు నిధులు కేటాయించలేదు. ఈ రెండూ కాకినాడకు చాలా కీలకమైనవే అయినప్పటికీ కేంద్రం మొండిచేయే చూపించిందంటున్నారు.

సామాన్యులకు పెనుభారం



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి చూపించారు. ఢిల్లీ, బీహార్ రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్టు కనిపిస్తోంది. రాజధానికి నిధులు కానీ, ప్రత్యేక హోదా ఊసు కానీ లేదు. ఆదాయం పన్ను రాయితీ ఇచ్చినా పెరిగే ధరలతో అది నిరుపయోగమే. పన్నుల భారం పెంచేదీ కేంద్రమే.. తగ్గిస్తున్నామని డబ్బాలు కొట్టుకునేది కేంద్రమే. జీఎస్టీ, పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించకపోవడం సామాన్యులకు పెను భారంగా మారుతుంది.

– కర్నాకుల వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం

ఆరోగ్య రంగానికి మేలు



ఆరోగ్య రంగానికి మరింత బలాన్ని చేకూర్చేలా కేంద్ర బడ్జెట్ ఉంది. ముఖ్యంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో భారీ సాయం అందించేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 36 జీవరక్షక మందులకు కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు ఇచ్చి, మరికొన్ని ఔషధాలను 5 శాతం డ్యూటీతో అందుబాటులోకి తెచ్చారు. ఇది రోగులపై ఆర్థిక భారం తగ్గిస్తుంది. పీఎం జాన్ ఆరోగ్య యోజన కింద గిగ్ వర్కర్లకు వైద్య సేవలు కల్పించడం అభినందనీయం.

– డాక్టర్ ఎస్.రామకృష్ణ, కాకినాడ

విద్యా రంగానికి ప్రాధాన్యం



పేదరికం రూపు మాపడమే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ సాగింది. రూ.12 లక్షల వరకూ వార్షిక ఆదాయంపై పన్ను ఉండకపోవడం హర్షణీయం. జ్ఞాన భారత్ మిషన్, న్యూక్లియర్ ఎనర్జీ మిషన్ ఏర్పాటు, విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు స్వాగతించదగ్గ విషయాలు. ఆక్వా, డైరీ, ఫుడ్ ప్రాసెసింగ్, కాటన్, కుటీర పరిశ్రమలకు, కృత్రిమ మేధకు పెద్దపీట వేశారు.

– డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, ఎంబీఏ మార్కెటింగ్, ఫైనాన్స్ అధ్యాపకుడు

జిల్లా ప్రాజెక్టులు గట్టెక్కలేదు



కాకినాడ - పిఠాపురం మెయిన్ రైల్వే లైన్, విమానాశ్రయం, స్మార్ట్ సిటీ స్కీమ్ పొడిగింపు భరోసా లేకపోవడం నిరుత్సాహపరచింది. బడ్జెట్‌లో బీహార్‌కు దక్కిన ప్రాధాన్యం మన రాష్ట్రానికి లేకపోవడం దురదృష్టకరం. కొత్త ప్రాజెక్టులు లభించలేదు. సిమెంట్, ఐరన్, పెట్రోల్, డీజిల్, వంట నూనె, వంట గ్యాస్, వ్యవసాయ పరికరాల వంటి వాటిపై జీఎస్టీ భారాలు తగ్గించలేదు.

– దూసర్లపూడి రమణరాజు, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, కాకినాడ

రైతు జీవితాల్లో భారీ మార్పు



ఇది రైతుల జీవితాల్లో భారీ మార్పు తీసుకొచ్చే బడ్జెట్. దేశంలో వెనుకబడిన 100 జిల్లాలను గుర్తించి, అక్కడి రైతుల సమగ్రాభివృద్ధికి తోడ్పడే పథకం ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన. అలాగే, కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం ద్వారా రైతులకు మరింతగా రుణాలు అందుతాయి. సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు వారి రుణాలకు ప్రభుత్వమే గ్యారెంటీ ఉంటూ రుణ పరిమితిని రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచడం మంచి నిర్ణయం.

– బిక్కిన విశ్వేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నిరుద్యోగం, ద్రవ్యోల్బణం మాటేమిటి?



ఎనిమిదోసారి రూ.50 లక్షల కోట్లకు పైబడి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగాన్ని, ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారో ప్రస్తావించకపోవడం శోచనీయం. మధ్య తరగతి వర్గానికి కొంత మేర ఆదాయ పన్ను మినహాయింపు కల్పించినా, అధిక ధరల నియంత్రణకు, ఉద్యోగ – ఉపాధి కల్పనకు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల గురించి బడ్జెట్లో ప్రస్తావించకపోవడం బాధాకరం. ముఖ్యంగా రూపాయి విలువ పతనంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపలేదు.

– ఐ.ప్రసాదరావు, యూటీఎఫ్ ప్రతినిధి, ప్రత్తిపాడు

చంద్రబాబు, పవన్ సిగ్గు పడాలి



కేంద్రంతో పిఠాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సంబంధాలు బాగుండటంతో కాకినాడను కెమికల్ హబ్‌గా ప్రకటిస్తారని ఆశించాం. కానీ అంతా శూన్యంగానే కనబడుతోంది. రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించారు. రాజధానికి నిధులు, ప్రత్యేక హోదా ఊసు లేదు. ఈ బడ్జెట్‌ను చూసి చంద్రబాబు, పవన్ సిగ్గుపడాలి. ఇప్పటికే ఉపాధి లేక గ్రామీణ ప్రజలు పట్టణాలకు వలసలు వెళుతున్నారు. ఈ పరిస్థితుల్లో కనీసం ఉపాధి హామీ పథకానికి సరిగ్గా నిధులు కేటాయించలేదు. ఈ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్ర జరుగుతోందనిపిస్తోంది. ఆదాయ పన్ను రాయితీ ఇచ్చినా.. పెరిగే ధరలతో మధ్య తరగతి ప్రజల జేబులు ఖాళీ అవుతాయి. కార్పొరేట్ పారిశ్రామికవేత్తలకు మరోసారి ఫుల్ మీల్స్ పెట్టారు.

– తాటిపాక మధు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కాకినాడ

న్యూస్‌రీల్

వేలాదిగా శృంగార వల్లభుని సన్నిధికి..



విశేష అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి మాఘ మాసం తొలి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. సుమారు 20 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవలు, కేశఖండన టికెట్లు, అన్నదాన విరాళాలుగా స్వామి వారికి రూ.3,89,409 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. 8 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశామన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, మరో నలుగురికి గాయాలు
- ఆటోనగర్ వద్ద ఘటన

రాజానగరం: జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన బోడపాటి సోమరాజు (80), భార్య అచ్చియమ్మ, మేనల్లుళ్లు దొమ్మేటి అర్జునరావు, దొమ్మేటి సత్యనారాయణతో కలిసి కటారి మల్లిబాబు ఆటోలో బెండపూడిలో బంధువుల ఇంట జరిగిన అపరకర్మకు వెళ్లారు. ఆ కార్యక్రమం అనంతరం తిరిగి వస్తున్న వారిని ఆటోనగర్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో సోమరాజు అక్కడికక్కడే మృతి చెందగా, అతడి భార్య, ఇద్దరు మేనల్లుళ్లతో పాటు ఆటో నడుపుతున్న మల్లిబాబు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దొమ్మేటి అర్జునరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రియా కుమార్ తెలిపారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుడు, అమ్మవారిని తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న దృశ్యం



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం

అన్నవరం: వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం రద్దీగా మారింది. కొండపై శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఈ కొత్త జంటలు, వారి బంధుమిత్రులతో పాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవదంపతులు కూడా వారి బంధువులతో కలసి సత్యదేవుని ఆలయానికి వచ్చి, సత్యదేవుని దర్శించుకుని, వ్రతాలాచరించారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడయ్యారు. దీంతో ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మండపాలు, క్యూ లైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు.

అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఆలయంలో ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు పర్యవేక్షించారు.

ఘనంగా ప్రాకార సేవ

ఆలయంలో సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద వేంచేయించి, తూర్పు రాజగోపురం వద్దకు ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ పండితులు పూజలు చేసిన అనంతరం ఈఓ సుబ్బారావు దంపతులు కొబ్బరి కాయ కొట్టి సేవను ప్రారంభించారు. పండితుల వేద మంత్రోచ్చారణలు, బాజాభజంత్రీల ఘోష నడుమ స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై మూడుసార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. పునఃపూజల అనంతరం స్వామి, అమ్మవార్లను తిరిగి ప్రధానాలయానికి చేర్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోరుకొండ ఆలయం దత్తత ఉపసంహరించరూ..

- ప్రభుత్వానికి అన్నవరం దేవస్థానం వినతి
- వరుస వివాదాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో లేఖ

అన్నవరం: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం దత్తతను ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అన్నవరం దేవస్థానం వినతిపత్రం సమర్పించింది. అన్నవరానికి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరుకొండ దేవస్థానం నిర్వహణ తమకు కష్టసాధ్యంగా మారిందని ఆ వినతిలో పేర్కొన్నారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఈ విషయం విలేకర్లకు తెలిపారు. కాగా, ప్రస్తుతం దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గతంలో అన్నవరం దేవస్థానం ఈఓగా ఉన్నప్పుడు కూడా ఇదేవిధంగా ప్రభుత్వానికి వినతి పత్రం పంపించారు. అయితే, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అప్పుడు దానిని అంగీకరించలేదు. కోరుకొండ దేవస్థానంలో జరుగుతున్న అనేక వివాదాలు అన్నవరం దేవస్థానం అధికారులకు తలనొప్పిగా మారాయి. మంచి జరిగితే ఆ దేవస్థానానికి, చెడు జరిగితే తాము పట్టించుకోవడం లేదనే అపవాదు వస్తోందని ఇక్కడి అధికారులు వాపోతున్నారు. కోరుకొండ ఆలయన నిర్వహణకు అన్నవరం దేవస్థానం ఏటా సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేస్తోంది. గత ఏడాది సెప్టెంబర్‌లో కోరుకొండ దేవస్థానం నిధులు రూ.16 లక్షలు దుర్వినియోగం చేశారనే అభియోగంపై అన్నవరం దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ కె.సతీష్, రికార్డు అసిస్టెంట్ టి.అనిల్ కుమార్, కోరుకొండ దేవస్థానానికి చెందిన రికార్డు అసిస్టెంట్ టి.రవికుమార్‌లను అప్పటి ఈఓ రామచంద్ర మోహన్ సస్పెండ్ చేశారు. తరువాత ఆ నిధులు జమ చేయడంతో తిరిగి వారికి ఉద్యోగాలిచ్చారు. అయినప్పటికీ ఆ వివాదం పూర్తిగా సమసిపోలేదు. గత నెలలో కోరుకొండ దేవస్థానం కార్యాలయంలో మద్యం సీసాలు దర్శనమిచ్చాయని పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీనిపై కూడా అన్నవరం దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతిసారీ ఏదో ఒక వివాదం రావడం అన్నవరం దేవస్థానం అధికారులకు తలనొప్పిగా మారుతోంది. మరోవైపు అన్నవరం దేవస్థానం ఆర్థిక ఇబ్బందుల కారణంగా గతంలో మాదిరిగా నిధులు ఖర్చు చేసే అవకాశం లేదని, అందువలన దత్తత నుంచి ఉపసంహరించాలని కోరినట్లు సమాచారం.

వెంకన్న స్వామీ.. సదా స్మరామి

- వాడపల్లికి పోటెత్తిన భక్తజనం
- ఒక్కరోజే రూ.33.62 లక్షల ఆదాయం

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి అన్నిదారుల నుంచి భక్తప్రవాహం వాడపల్లి క్షేత్రానికి ప్రవహించింది. శనివారం తెల్లవారుజామున అర్చక స్వాములు స్వామివారి సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించారు. స్వామివారిని అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారితో పాటు, ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులతో క్షేత్రం కిక్కిరిసిపోయింది. మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేరాలని వేడుకున్నారు. స్వామిని దర్శించుకుని మురిసిపోయారు. ముందుగా భక్తులు గౌతమీ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అలాగే ఆలయ ఆవరణలో వేంకటేశ్వర స్వామి క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది, స్థానిక స్వామివారి సేవ వలంటీర్లు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఒక్కరోజు స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా రూ.33,62,453 ఆదాయం సమకూరినట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బందోబస్తు నిర్వహించారు.

9 నుంచి జిల్లా స్థాయి భజన పోటీలు

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెంలో వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ ఆలయంలో జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు శనివారం ఈ విషయం తెలిపారు. పురుషులకు, స్త్రీలకు విడివిడిగా ఈ పోటీలు ఉంటాయన్నారు. ప్రతి బృందంలో 10 మంది సభ్యులుండాలని, అందరూ ఒకే గ్రామానికి చెందిన వారై ఉండాలని తెలిపారు. సభ్యులందరూ ఒకే రకమైన యూనిఫాంతో భజనలో పాల్గొనాలన్నారు. మహిళల బృందంలో పురుషులు పాడరాదన్నారు. హార్మోనియం, డోలక్ వాయించడానికి మినహాయింపు ఉంటుందని తెలిపారు. కీర్తనలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రతి బృందం సభ్యులు విధిగా గోవింద నామాలు పాడాలన్నారు. ఒక్కో బృందానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు 94412 94845, 85209 94222 సెల్ ఫోన్‌కు సంప్రదించి తమ బృందాల పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. స్త్రీ, పురుషులకు విడివిడిగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు.

6 నుంచి కుంతీమాధవుని కల్యాణోత్సవాలు



కుంతీమాధవ స్వామి ఆలయం

పిఠాపురం: దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురం శ్రీ కుంతీ మాధవస్వామి వారి కల్యాణోత్సవాలు ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించనున్నామని దేవస్థానం ఈఓ నున్న శ్రీరాములు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రతి రోజూ పంచామృతాభిషేకం, సహస్రనామార్చనలు నిర్వహించనున్నామన్నారు. ఉత్సవాలు జరగనున్నాయిలా..

6వ తేదీ: ధ్వజారోహణం, పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహుద్దూర్ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాలకు శ్రీకారం. ఈ రోజు నుంచి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం శ్రీచక్ర పెరుమాళ్ల గ్రామోత్సవం.

7వ తేదీ: ఉదయం 9 గంటలకు అలంకార తిరుమంజనం, కల్యాణాలంకారం.

8వ తేదీ: స్వామివారి ధ్రువమూర్తులకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన. సాయంత్రం 4 గంటలకు గజవాహనంపై గ్రామోత్సవం, రాత్రి 9 గంటలకు స్వామివారి దివ్య కల్యాణోత్సవం.

9వ తేదీ: ఉదయం 9 గంటలకు శేష, సాయంత్రం 4 గంటలకు గరుడ వాహనాలపై గ్రామోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు.

10వ తేదీ: రాత్రి 7 గంటలకు పొన్న వాహనంపై గ్రామోత్సవం.

11వ తేదీ: రాత్రి 10 గంటలకు రథోత్సవం.

12వ తేదీ: ఉదయం 7 గంటలకు ఉప్పాడ వద్ద సముద్ర తీరంలో స్వామివారి చక్రస్నానం.

13వ తేదీ: ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకం. సాయంత్రం 7 గంటలకు అమ్మవారికి కుంకుమ పూజ. రాత్రి 9 గంటలకు శ్రీపుష్ప యాగం, కల్యాణోత్సవాల ముగింపు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం



తిమ్మాపురం పంచాయతీ కార్యాలయంలో పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

- పంచాయతీ కార్యాలయం వద్ద వృద్ధుల పడిగాపులు
- కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు
- సాయంత్రానికి అందజేత

కాకినాడ రూరల్: ఇంటి వద్ద ఉదయాన్నే అందాల్సిన సామాజిక భద్రతా పింఛన్లు మధ్యాహ్నమైనా అందని ఘటన మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గంటలు గడుస్తున్నా తమకు పింఛన్ సొమ్ము అందకపోవడంతో ఆవేదన చెందిన లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు, ఎంపీడీఓ సతీష్, ఈవో పీఆర్ అండ్ ఆర్‌డీ రామాంజనేయులు తిమ్మాపురం పంచాయతీ కార్యాలయం వద్దకు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పడిగాపులు పడుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. తమకు పింఛన్ ఇవ్వలేదని వారు చెప్పడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరారు. జూనియర్ అసిస్టెంట్ కమ్ బిల్లు కలెక్టర్ యశ్వంత్ కుమార్‌కు అప్పగించిన క్లస్టర్ పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు అందలేదని శ్రీనివాస్ చెప్పారు. మొత్తం 62 మందికి గాను 41 మందికి ఉదయం పింఛన్లు అందించారని, మిగిలిన 22 మందికి ఇవ్వలేదని తెలిపారు. దీనిపై యశ్వంత్ కుమార్‌తో పీడీ, సీఈఓలు మాట్లాడగా.. ఇంద్రపాలెంలో బెడ్ రిడెన్ లబ్ధిదారు వద్దకు వెళ్లానని బదులిచ్చాడు. అయితే, సాయంత్రం 5.30 గంటల వరకూ రాకపోవడంతో అతడు గైర్హాజరైనట్టుగా పంచాయతీ కార్యదర్శి నుంచి రిపోర్టు తీసుకుని, వేరే సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు పింఛను సొమ్మును డీఆర్‌డీఏ పీడీ, జెడ్పీ సీఈవో అందజేశారు. పింఛన్ల పంపిణీలో జాప్యం, బాధ్యుడిపై చర్యలకు కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. కాగా జూనియర్ అసిస్టెంట్ యశ్వంత్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ డీపీఓ రవికుమార్ రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 - 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

అంతర్వేదిలో గొప్పగా..



ప్రధాన ద్వారం వద్ద ఆకర్షణీయంగా అలంకరణ



ఆలయం వెలుపల ఐరన్ రాడ్లతో క్యూ లైన్



ఆలయానికి ఉత్తరం వైపున తెప్పోత్సవానికి తాత్కాలిక చెరువు పనులు

అంతర్వేది ఉత్సవాలంటే కనులకు వైకుంఠమే.. అలాంటి వేడుకలకు సమయం దగ్గర పడడంతో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 4 నుంచి ప్రారంభం కానున్న లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆయా శాఖల ఆధ్వర్యంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దేవాలయం, పరిసర ప్రాంతాల్లో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో క్యూ లైన్లు, డెకరేషన్ పనులు చేపట్టారు. ఆలయానికి ఉత్తరం వైపున స్వామివారి తెప్పోత్సవానికి తాత్కాలిక చెరువు తవ్వే పనులు వేగవంతం అయ్యాయి.

– సఖినేటిపల్లి



అంతర్వేదిలో కల్యాణ వేదిక ప్రాంతంలో తాటాకుల పందిరి

భార్యను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్



మూలపేట హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

కొత్తపల్లి: జల్సాలకు అలవాటు పడి, అక్రమ సంబంధం పెట్టుకున్న వ్యక్తి తన భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు, సదరు నిందితుడిని అరెస్ట్ చేశామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్సై వెంకటేష్‌తో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వారి కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం మూలపేట గ్రామానికి చెందిన రాచపల్లి ప్రసాద్ అదే గ్రామానికి చెందిన గింజాల బాలను తొమ్మిదేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అతను జల్సాలు చేయడమే కాకుండా, అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చాయి. గత నెల 18న అర్ధరాత్రి సమయంలో భార్యతో గొడవ పడ్డాడు. తర్వాత బాల మెడకు చున్నీతో ఉరివేసి దిండుతో ఊపిరి ఆడకుండా చేశాడు. బాల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వాంతులు, విరోచనాలు కావడంతో మృతి చెందిందని ప్రసాద్ సమాచారం అందించాడు. బాల మృతదేహాన్ని తర్వాత రోజు ఖననం చేశారు. బాల తల్లి గింజాల లక్ష్మి తన కుమార్తె అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖననం చేసిన మృతదేహాన్ని తర్వాత రోజు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పోస్టుమార్టం నిర్వహించారు. జనవరి 30న వచ్చిన పోస్టుమార్టం నివేదిక ఆధారంగా, దర్యాప్తు మేరకు ముద్దాయిపై హత్య కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారనే సమాచారంతో ప్రసాద్ శనివారం గ్రామ రెవెన్యూ అధికారి వద్ద లొంగిపోవడంతో అరెస్ట్ చేసి పిఠాపురం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

చదువుల పండగకు సర్వం సిద్ధం

- నేడు లక్ష కలాల పూజ
- అయినవిల్లిలో ఏర్పాట్లు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో చదువుల పండగ పేరుతో ఆదివారం నుంచి 4వ తేదీ వరకూ మహాక్రతువులు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశామని ఆలయ ఈఓ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు శనివారం తెలిపారు. శ్రీపంచమి సందర్భంగా ఆదివారం గణపతి కల్ప ప్రారంభంతో సప్తనదీ జలాభిషేక సహిత లక్ష కలాల వితరణ మహోత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. స్వామివారి సప్తనదీ జలాభిషేకం కోసం సప్త నదులైన గోదావరి, గంగ, యమున, సరస్వతి, సింధు, కావేరి, నర్మద నుంచి ఆలయ అధికారులు జలాలు సేకరించారు. భక్తుల దర్శనార్థం ఆలయ మండపంలో సప్తనదీ జలాలు, లక్ష కలాలు ఉంచారు. జలాభిషేకం అనంతరం స్వామివారి పాదాల వద్ద లక్ష కలాలతో పూజలు చేసేందుకు వేద పండితులు ఏర్పాట్లు చేశారు. 3న సరస్వతీ కల్పం, 4న మహా పూర్ణాహుతి పూజలు ఉంటాయి. శ్రీపంచమి సందర్భంగా స్వామివారి సన్నిధిలో విద్యార్థులచే సరస్వతీ పుజలు చేయిస్తారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారని ఈఓ తెలిపారు. లక్ష కలాలను విద్యార్థులకు ఈ నెల 8, 9 తేదీల్లో పంపిణీ చేస్తామన్నారు. స్వామి కలాలతో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయనేది విద్యార్థుల నమ్మకం. అందుకే స్వామివారి కలాల కోసం విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ సారి కూడా స్వామివారి సప్తనదీ జలాలు, లక్ష కలాల వితరణ కార్యక్రమానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



విశేష అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో సప్త నదుల నుంచి సేకరించిన జలాలు

భక్తులతో కిటకిట

స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి పంచామృత, లఘున్యాస అభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, తులాభారం జరిపారు. స్వామివారి అన్న ప్రసాదాన్ని 1,720 మంది భక్తులు స్వీకరించారు. ఈ ఒక్కరోజు వివిధ పూజా టిక్కెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాలు, తదితర వాటి ద్వారా రూ.2.44 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

కానిస్టేబుల్ నిజాయితీ



రూ.8 లక్షలను వస్త్ర దుకాణ యజమాని బబ్లూకు అందజేస్తున్న జగ్గంపేట సీఐ, ఎస్సై

జగ్గంపేట: ఓ కానిస్టేబుల్ నిజాయితీ చాటుకున్నాడు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కథనం ప్రకారం.. జగ్గంపేటలో కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ తోట సూరిబాబు దుస్తులు కొనుగోలు చేశారు. అయితే దుస్తుల సంచితో పాటు రూ.8 లక్షలు ఉంచిన సంచిని కూడా సూరిబాబుకు ఆ వస్త్ర దుకాణ యజమాని శేక్ బబ్లూ అందజేశారు. ఇది గమనించని కానిస్టేబుల్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తరువాత పొరపాటును గమనించిన బబ్లూ జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై రఘునాథరావు, రైటర్ కృపావరం తక్షణం స్పందించి సీసీ కెమెరాలు, ఫోన్ పే చేసిన నంబర్ ద్వారా నగదు కవరును పట్టుకుని వెళ్లిన వ్యక్తిని గుర్తించారు. అతను కాకినాడకు చెందిన కానిస్టేబుల్ కావడంతో అతనికి జరిగిన పొరపాటును వివరించారు. అది గమనించిన కానిస్టేబుల్ సూరిబాబు నిజాయితీగా నగదు ఉన్న సంచిని సీఐ, ఎస్సైలకు అందజేశారు. దానిని వారు షాపు యజమాని బబ్లూకి అందజేయడంతో అతను పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

సముద్రంలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన అప్పారావు

కొత్తపల్లి: వేటకు వెళ్లిన ఒక మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ సముద్రంలో పడి మృతి చెందినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం ఉప్పాడ శివారు సూరాడపేటకు చెందిన సూరాడ అప్పారావు (19) ఉప్పాడకు చెందిన సూరాడ యల్లాజీ బోటుపై శుక్రవారం తెల్లవారు జామున వేటకు వెళ్లాడు. సముద్రంలో వేటాడుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయాడు. అతని కోసం తోటి మత్స్యకారులు గాలించగా తాతారావు బోటు వలకు చిక్కాడు. అప్పారావు మృతదేహాన్ని శనివారం తెల్లవారు జామున అమీనాబాద్ తీరానికి తీసుకువచ్చారు. దీనిపై ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు లాంఛనాలతో మూర్తి అంత్యక్రియలు



పోలీసు లాంఛనాలతో మూర్తి అంత్యక్రియలు

కె.గంగవరం: తణుకులో తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఎస్సై ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి పార్థీవదేహాన్ని శుక్రవారం రాత్రి ఆయన స్వగ్రామం కె.గంగవరం తీసుకువచ్చారు. శనివారం ఆ గ్రామానికి జిల్లా అదనపు ఎస్పీ ప్రసాద్ వచ్చి నివాళి అర్పించారు. గ్రామస్తులు, బంధువులు, సహచరులతో మాట్లాడారు. ఇదిలా ఉంటే కోటిపల్లి గ్రామ గోదావరి ఒడ్డున మూర్తి అంత్యక్రియలు నిర్వహించారు. అక్కడ రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ, పామర్రు ఎస్సై ఎస్‌కే జానీబాషా ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలను పూర్తి చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు కోరారు. శనివారం కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఈ నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. అదే రోజు నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారని అన్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెంకటరావు వివరించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి కాగా, ఏఆర్‌వోలుగా ఆయా జిల్లాల డీఆర్వో వ్యవహరిస్తారన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో 3,15,261 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఏలూరు కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్.వెంకటేశ్వరరావు, కె.కృష్ణమోహన్, ఎస్.అప్పారావు, పి.వీరబాబు, బి.జయప్రకాష్, జి.సాయిబాబా, ఎ.వీరవెంకట సత్యనారాయణ, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్



చెస్‌లో రేటింగ్ సాధించిన విద్యార్థులు

అమలాపురం టౌన్: అమలాపురం విక్టరీ అకాడమీకి చెందిన మరో ముగ్గురు విద్యార్థులు చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించారని ఆ అకాడమీ ప్రిన్సిపాల్, జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకటసురేష్ తెలిపారు. పెద్దాపురం జవహర్ నవోదయ స్కూల్‌లో చదువుతున్న కొండా శివేంద్ర 1,406 రేటింగ్ పాయింట్లు, అమలాపురం విద్యానిధి స్కూల్‌లో చదువుతున్న పితాని రాఘవేంద్ర 1,443, సాధనాల శ్రీసంతోష్ 1,494 రేటింగ్ పాయింట్లు సాధించారని అన్నారు. ఇంత వరకూ విక్టరీ అకాడమీకి చెందిన 30 మంది విద్యార్థులు రేటింగ్ సాధించారని వివరించారు. అంతర్జాతీయంగా రేటింగ్ సాధించిన విద్యార్థులను రాష్ట్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ కవురు జగదీష్, అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఆకుల బాపన్న నాయుడు అభినందించారు.

ఆలయంలో వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట: మాధవపట్నంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడి బస్టాండ్ వద్ద ఉన్న ఆలయంలో రేకుల షెడ్ రాడ్‌కు పంచెతో ఉరి వేసుకున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించి సామర్లకోట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉరి వేసుకున్న వ్యక్తి మోకాళ్లు నేలకు తాకి ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తుంది. తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న తల్లి సంకర రత్నవతి సంఘటనా ప్రదేశానికి చేరుకుంది. తన కుమారుడు రాంబాబు (48) కొంత కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతుండడతో మాధవపట్నంలోని గ్లోబల్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నామని పోలీసులకు తెలిపింది. రోజూ కొమరిగిరి వెళ్లి రావడం ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామంలో ఉన్న బస్ షెల్టర్‌లో ఉంటూ రోజూ డాక్టర్‌తో ఇంజెక్షన్ చేయిస్తున్నట్లు చెప్పింది. శుక్రవారం సాయంత్రం తన కుమారుడిని అక్కడే ఉండమని చెప్పి కొమరిగిరిలో శనివారం పింఛను తీసుకోవడానికి వెళ్లినట్లు సత్యవతి చెప్పింది. ఇంతలో ఇలా జరిగినట్లు వివరించింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సీఐ కృష్ణభగవాన్ కేసు నమోదు చేశారు.

కేసు నిర్వీర్యానికి కుట్ర

కరప: వాకాడ పాఠశాలలో కొందరి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు వీఎస్ రామారావు కేసును నిర్వీర్యం చేస్తున్నట్టు మానవ హక్కుల వేదిక శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. నిజ నిర్ధారణ కోసం వాకాడ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పోలీసులను కలసినట్టు ఆ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు కానీ ఏమీ చెప్పకపోవడం, కరప పోలీస్ స్టేషన్‌లో దీనికి సంబంధించి ఎటువంటి కేసు నమోదు కాకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. బాధితులు, తల్లిదండ్రులు నోరు తెరిచి చెప్పుకోకుండా కట్టడి చేసినట్టు ఆరోపించారు. నిజ నిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఉపాధ్యక్షుడు ఎ.రవి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.